

ఇస్తేమా కార్యక్రమానికి చురుగ్గా జరుగుతున్న ఏర్పాట్లు

# రేపటి నుంచి ఇస్తేమా

- పరిగిలో మూడు రోజులపాటు నిర్వహణ
- కార్యక్రమానికి హాజరు కానున్న 2 నుంచి 3 లక్షల మంది ముస్లింలు
- వసతుల కల్పనకు రూ.2.45 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఇస్తేమా ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ రంజిత్‌రెడ్డి

పరిగి, జనవరి 4 : పరిగి పట్టణ శివారులో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజులపాటు ఇస్తేమా జరుగనున్నది. ఈ కార్యక్రమ నిర్వహణకు పరిగి మున్సిపాలిటీ పరిధిలోని న్యామత్‌నగర్ సమీపంలో 280 ఎకరాల్లో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇస్తేమాకు తెలం గాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని గుల్బర్గా, బీదర్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 2 నుంచి 3 లక్షల వరకు ముస్లింలు హాజరు కానున్న ట్లు సమాచారం. కార్యక్రమానికి వచ్చిన వారు కూర్చు నేందుకు కు ర్చీలతోపాటు భోజన వసతి కోసం 26 వంటశాలను ఏర్పాటు చేస్తున్నా రు. మంచినీటి సదుపాయం కోసం ప్రత్యేకంగా మిషన్ భగీరథ పైపులైన్‌ను జాఫర్‌పల్లి డబ్ల్యూటీపీ నుంచి కార్యక్రమ నిర్వహణ స్థలానికి ఏర్పాటు చేశారు. వాహనాలను నిలిపేందుకు ప్రత్యే కంగా పార్కింగ్ కేం ద్రాల ఏర్పాటుతోపాటు మరుగుదొడ్లు, ఆరు ప్రత్యేక వైద్య శిబిరాలు అందుబాటులో ఉండనున్నాయి. ఈ నెల 6వ తేదీ శనివారం ఉదయం ఇస్తేమా ప్రారంభమై 8వ తేదీ సోమవారం సాయంత్రం ముగియనున్నది. ఈ కార్యక్రమం కోసం జిల్లా ఎస్పీ కోటి రెడ్డి పర్యవేక్షణలో సుమా రు 500 మంది పోలీసులు బందోబస్తు నిర్వ హించనున్నారు. ఇందులో ఇద్దరు అదనపు ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, పదిమంది సీఐలు, 30 మంది ఎస్ఐలు ఉండనున్నారు. కాగా ఇస్తేమా కార్యక్రమ నిర్వహణ, సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం రూ.2.45 కోట్లు మంజూరు చేసింది. మంచినీటికి సంబంధించి సంపు నిర్మాణం, ఇతర పనుల కో సం రూ.85లక్షలు, పైపులైన్ నిర్మాణానికి రూ.68 లక్షలు, రోడ్డు నిర్మా ణం, పార్కింగ్ ఏర్పా టు కోసం రూ.40 లక్షలు, నిరంతర విద్యుత్ సరఫరాకు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ఇతర పనులకోసం రూ.48.35లక్షలు, ఇతర పనులకోసం రూ.4.58 లక్షలు మంజూరయ్యాయి.

## ఏర్పాట్లను పరిశీలించిన చేవెళ్ల ఎంపీ

పరిగి పట్టణ శివారులో ఈనెల 6వ తేదీ శనివారం నుంచి ప్రారంభం కానున్న ఇస్తేమా ఏర్పాట్లను గురువారం చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ జి. రంజిత్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇస్తేమాకు ఎంతమంది హాజరవుతారు.. వారికి భోజనం, మంచినీరు, ఇతర వసతుల కల్పనపై కమిటీ వారిని ఎంపీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంచినీటి సరఫరాకు ఏర్పాటుచేసిన సంపు, ఇతర ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు మాజీ సభ్యుడు వాహిద్ అహ్మద్ , మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, ఎంపీపీ కరణం అరవిందరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, మాజీ జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు మీర్‌మహమూద్‌అలీ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షు డు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వెంకటయ్య, భాస్కర్, కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి కోసం ఏర్పాటుచేసిన సంపులోకి వదులుతున్న మిషన్ భగీరథ నీరు

# యాసంగికి గడ్డుకాలం..

- ఎనిమిదిన్నర అడుగుల్లోకి పడిపోయిన భూగర్భ జలాలు
- ఈ యాసంగిలో కేవలం 80 వేల ఎకరాల్లోనే పంటలు సాగయ్యే అవకాశం
- ఇప్పటివరకు 11 వేల ఎకరాల్లోనే పంటల సాగు
- గతేడాది లక్షా ఇరవై వేలకు పైగా ఎకరాల్లో..
- సాగు తగ్గడానికి నీటి కొరత, పెట్టుబడి సాయం అందక పోవడమే కారణం!



**గత యాసంగి, ప్రస్తుత యాసంగిలో పంటల సాగు వివరాలు ఎకరాల్లో..**

| పంట | 2022-23 యాసంగిలో సాగు విస్తీర్ణం | 2023-24 యాసంగిలో అంచనా | ఇప్పటివరకు సాగైన పంటలు |
|---|---|---|---|
| వరి | 90,885 | 52,470 | 2,340 |
| జొన్న | 656 | 780 | 97 |
| మొక్కజొన్న | 13,530 | 6,205 | 872 |
| వేరు శనగ | 4,912 | 4,509 | 5,303 |
| పొద్దుతిరుగుడు | 660 | 456 | 24 |
| కుసుమ | 5,297 | 2,731 | 1,549 |
| శనగలు | 4,439 | 6,497 | 1,244 |
| ఇతర పంటలు | 2,860 | 7,284 | 1,965 |
| **మొత్తం** | **1,23,239** | **80,932** | **11,224** |

రంగారెడ్డి, జనవరి 4 (నమస్తే తెలంగాణ) : గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది యాసంగికి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. సరైన వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో పంటలను సాగు చేసే పరిస్థితి లేకుండా పోతున్నది. ఓ వైపు నీటి కొరత.. మరోవైపు చేతిలో పెట్టుబడులకు డబ్బులు లేకపోవడంతో జిల్లా రైతాంగం భూములను పడావుగా ఉంచుతున్నది. గత యాసంగితో పోల్చితే 40వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గుతున్నది. ఈసారి యాసంగిలో 80 వేల ఎకరాల్లోనే పంటలు సాగయ్యే అవకాశముందని వ్యవసాయ శాఖ అంచనా వేయగా.. ఇప్పటివరకు 11 వేల ఎకరాల్లోనే రైతులు పంటల సాగును మొదలుపెట్టారు. గడిచిన పదేండ్ల కాలంలో ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ ఎదురుకాలేదని రైతాంగం పేర్కొంటున్నది.

## పొంచి ఉన్న సాగునీటి గండం..

ఈ ఏడాది జూలై, సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో వర్షాలు బాగానే కురిసినప్పటికీ అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో మాత్రం లోటు వర్షపాతం నమోదైంది. ఈ మూడు నెలల వ్యవధిలో మొత్తం 128.2మి.మీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా.. 23.7మి.మీటర్లు మాత్రమే కురిసిం ది. మొత్తంగా 81.5మి.మీటర్ల లోటు వర్షపాతం నమోదైంది.గతేడాది నవంబర్-డిసెంబర్ మధ్యకాలంలో 5.02 మీటర్ల లోతులో ఉన్న భూగర్భజలాలు ఈ ఏడాది 8.2 మీటర్ల లోతులోకి పడిపోయాయి. దీంతో బోర్లు, బావుల్లో నీటి మట్టాలు అడుగంటి గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. చెరువులు, కుంటల్లో ఉన్న కొద్దిపాటి నీటి కారణంగా ఆయా ప్రాంతాల్లోనే పంటల సాగు ఆశాజనకంగా ఉంది.

## పంటల సాగు అంతంతే..

గతేడాది యాసంగిలో జిల్లావ్యాప్తంగా 1,23,239 ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేశారు. అయితే ఈసారి సాగుకు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ప్రస్తుత పరిస్థితుల్లో యాసంగి సీజన్‌లో 80,932 ఎకరాల్లోనే పంటలు సాగయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అం చనా వేస్తుండగా..ఆ మేరకు కూడా పం టలు సాగయ్యే పరిస్థితి కనిపించడంలేదు. వరి సాగుకు ఇంకా సమయం ఉన్నప్పటికీ మిగతా పంటల సాగును సైతం రైతులు నేటివరకు మొదలుపెట్టలేదు. యాసంగి సీజన్ మొదలై నెల రోజులు కావొస్తున్నా జిల్లాలో ఇప్పటివరకు కేవలం 11,224 ఎకరాల్లోనే పంటలు సాగయ్యా యి. పెట్టుబడులకు రైతుల చేతిలో డబ్బుల్లేకపోవడం వల్లనూ రైతులు పంటల సాగుకు సాహసించడం లేనట్లు తెలుస్తున్నది. రైతుబంధు పథకం కింద కాంగ్రెస్ ప్రభుత్వం యాసంగి సీజన్‌కు రూ. 378.92 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా..ఇప్పటివరకు కేవలం రూ. 35.66 కోట్లను మాత్రమే జమ చేసింది. పెట్టుబడి సాయం ఇప్పటివరకు ఎకరం లోపు ఉన్న రైతులకు మాత్రమే వచ్చింది. ఈ కారణంగానూ రైతులు సాగుకు ఉపక్రమించే పరి స్థితులు కనబడడం లేదు. చాలామంది రైతులు భూములను పడావుగా నే ఉంచాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తున్నది. దీంతో గత వానకాలం వరకు పచ్చని పంటలతో కళకళలాడిన పొలాలు నేడు బీడుపడి పోయి కన్పించనున్నాయి.




### పంటల సాగు తగ్గుతున్నది



గతేడాది కంటే ఈ ఏడాది పంటల సాగు తగ్గుతున్నది. గతంలో బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉండడంతోపాటు పంటల సాగుకు అప్పటి ప్రభుత్వం వానకాలం, యాసంగి సీజన్లకు అదునుకు ముందు గా రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతుబంధు పెట్టుబడి సాయాన్ని జమ చేసేది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎకరం లోపే పెట్టుబడి సాయాన్ని అందించింది. మిగిలిన వారికి ఎప్పుడు ఇస్తుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. దీనికి తోడు భూగర్భజలాలు అడుగంటుతుండడంతో బోరుబావుల్లోనూ నీరు తగ్గుతున్నది. దీంతో గతేడా దితో పోల్చితే సగం వరకు వరి, ఇతర పంటల సాగు తగ్గుతున్నది.

-అంజయ్య, రైతు కుమ్మరిగూడ(షాబాద్)

### పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలి



రైతుబంధు పెట్టుబడి సాయాన్ని వెంటనే అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి. పంట సాయం రాకపోవడంతో చాలామంది రైతులు ఇబ్బంది పడుతున్నారు. వానకాలంలో సరిగ్గా వానలు పడకపోవడంతో పంట దిగుబడి అంతంత మాత్రంగానే ఉన్నది. యాసంగి సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు ఎకరం వరకే పెట్టుబడి సాయాన్ని అందించింది. ఎకరా కంటే ఎక్కువ ఉన్న వారికి రైతుబంధు బ్యాంకులో జమ కాకపోవడంతో రైతులు పైసల్లేక ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఠంఛన్‌గా పెట్టుబడి సాయాన్ని అందించేవారు.

-చేగూరి మహేశ్, యువ రైతు, కడ్తాల్



### ఉపాధి హామీ పనికి పోతున్నా.

ఇప్పటివరకూ రైతుబంధు పెట్టుబడి సాయం పడలేదు. దీని కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. వానకాలంలో కొద్దిగా వరిని నాటు వేశా. ప్రస్తుతం ఉపాధి హామీ పనికిపోతున్నా. గత యాసంగిలో కొద్దిగా పొలం సాగైంది. వానలు సరిగ్గా పడకపోవడంతో ఇప్పుడు పంట సాగు అవుతుందనే నమ్మకంలేదు. ఉన్న భూమిలో ఆరుతడి పంటలను సాగు చేద్దామని అనుకుంటున్నా.

- తీగపురం కృష్ణయ్య, రైతు, వీర్లపల్లి గ్రామం, నందిగామ

# అవిశ్వాస ఘంటికలు..!

- బడంగ్‌పేట కార్పొరేషన్‌లో వేడెక్కుతున్న రాజకీయం
- మేయర్‌పై బీఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్ల గుర్రు
- ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ల అవిశ్వాసానికీ రంగం సిద్ధం

**హైదరాబాద్ నగర శివారులోని కీలకమైన మున్సిపల్ కా ర్పొరేషన్, మున్సిపాలిటీల్లో అవిశ్వాస ఘంటికలు మోగుతున్నాయి. మున్సిపల్ చట్టం ప్రకారం నాలుగేండ్లు పూర్తైన తర్వాతే మేయర్‌పై అవిశ్వాసానికి అవకాశం ఉండడంతో ప్రస్తుతం పలుచోట్ల కౌన్సిలర్లు ప్రస్తుత మేయర్లపై తిరుగుబావుటా ఎగురవేసేందుకు సిద్ధమవుతున్నారు. దాదాపు అన్ని స్థానిక సంస్థల్లోనూ ఈ నెలాఖరుకు నాలుగేండ్లు పూర్తి కానుండడంతో అవిశ్వాసానికి పావులు కదులుతున్నారు. ఇందులో భాగంగా శివారులోని కీలకమైన బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుత మేయర్ చిగురిం త పారిజాతా నర్సింహారెడ్డిపై సొంత పార్టీతోపాటు ఇతర పార్టీల కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. దీంతో అక్కడ రాజకీయ వాతావరణం వేడెక్కింది. అంతర్గతంగా చోటుచేసుకుంటున్న పరిణామా ల దరిమిలా త్వరలోనే తెరపైకి అవిశ్వాస తీర్మానం వచ్చే అవకాశముంది. దీంతోపాటు ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీల్లోనూ ప్రస్తుత చైర్‌పర్సన్లపై అవిశ్వాసానికి కౌన్సిలర్లు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.**

–సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి,
జనవరి 4 (నమస్తే తెలంగాణ)



మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అటు విస్తీర్ణంలోనూ ఇటు ఆదాయంలోనూ పెద్దదే. ఇంతటి కీలకమైన కార్పొరేషన్‌లో ప్రస్తుతం చిగురింత పారిజాత మేయర్‌గా ఉన్నారు. కార్పొరేషన్ పరిధిలో 32 వార్డులుండగా..ఇందులో 14 స్థానాలను బీఆర్‌ఎస్ సొంతం చేసుకున్నది. బీజేపీ పది స్థానాల్లో గెలవగా, కాంగ్రెస్ ఏడు స్థానాల్లో, స్వతంత్ర అభ్యర్థి ఒక స్థానంలో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన చిగురింత పారిజాత బీఆర్‌ఎస్‌లోకి రావడంతో ఆమెకు మేయర్ పదవి దక్కింది. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల దరిమిలా తిరిగి ఆమె కాంగ్రెస్‌లో చేరింది. దీంతోపాటు ఆమె ఏకపక్ష ధోరణితో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లతోపాటు బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్లు సైతం గుర్రుగా ఉన్నారు. మేయర్‌పై అసంతృప్తి దావనంలా వ్యాపిస్తుండటంతో అవిశ్వాస తీర్మానానికి బీజం పడింది. బీఆర్‌ఎస్‌కు చెందిన 14 మంది కార్పొరేటర్లు ఇందుకు సిద్ధమవుతుండగా... బీజేపీకి చెందిన 10 మంది కార్పొరేటర్లు కూడా ఇటీవల సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ఆమెను మేయర్ పీఠం నుంచి దింపాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ముఖ్యంగా కొన్నిరోజులుగా మేయర్ అధికారులపై దురుసుగా వ్యవహరిస్తుండటం, తమ పార్టీ అధికారంలో ఉన్నందున తాను చెప్పినట్లుగానే నడవాలం టూ ఇష్టానుసారంగా అధికారులతో మాట్లాడుతుండటం కూ డా అనేకమంది కార్పొరేటర్లకు నచ్చడం లేదని సమాచారం. దీంతోపాటు కాంగ్రెస్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించి విఫలమైన ఆమె...కొన్నిరోజులుగా ఎమ్మెల్సీ తనకే వస్తుందంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఇదేకాకుండా చేవెళ్ల ఎంపీ సీటు కూడా తనకే వస్తుందంటూ వ్యాఖ్యానిస్తుండటం కాంగ్రెస్ పార్టీ వర్గాలకు నచ్చడం లేదు. ప్రతి అంశంలోనూ తనకే అవకాశం ఇవ్వాలంటే.. ఇంతకాలం కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతున్న తాము ఏం కావాలంటూ కొందరు నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే మేయర్ పీఠంకోసం ఎంత ఖర్చైనా.. ఆమెను పదవి నుంచి దింపేందుకు కొందరు కాంగ్రెస్ కార్పొరేటర్లు పావులు కదుపుతున్నారు. ఎలాగూ బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్లు కూడా అదే ప్రయత్నంలో ఉన్నందున ఇక్కడ అవిశ్వాసం అనివార్యమనే సంకేతాలు కనిపిస్తున్నాయి.



చెవుల స్వప్న

## రసవత్తరం.. పెద్దఅంబర్‌పేట రాజకీయం

పెద్దఅంబర్‌పేట మున్సిపల్ రాజకీయం కూడా ప్రస్తుతం రసవత్తరంగా మారింది. ఇక్కడ 24 వార్డులుండగా... ఇందులో బీఆర్‌ఎస్ 8 స్థానాలు గెలుచుకోగా, కాంగ్రెస్ అత్యధికంగా 13 స్థానాలను గెలుచుకున్నది. బీజేపీ, సీపీఐ, స్వతంత్ర అభ్యర్థులు చెరో స్థానంలో విజయం సాధించారు. అయినప్పటికీ కాంగ్రెస్‌లోని కౌన్సిలర్లు రెండు గ్రూపులుగా విడిపోవడం బీఆర్‌ఎస్‌కు కలిసొచ్చింది. చైర్‌పర్సన్ పదవిని ఎస్సీ మహిళకు కేటాయించినందున వైస్ చైర్మన్ పదవికోసం కాంగ్రెస్ పార్టీలోని కౌన్సిలర్ల మధ్య పోటీ నెలకొన్నది. ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మేనల్లుడు మురళీధర్‌రెడ్డికి వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలని అప్పట్లో కోమటిరెడ్డి పట్టుబట్టగా.. దీనికి వ్యతిరేకంగా విజయశేఖర్‌రెడ్డి వర్గం బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలిపింది. దీంతో బీఆర్‌ఎస్‌కు చెందిన చెవుల స్వప్నకు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు కూడా కలిసి రావడంతో చైర్‌పర్సన్ పీఠం దక్కిం ది. వైస్ చైర్‌పర్సన్‌గా విజయశేఖర్‌రెడ్డి భార్య సంపూర్ణ అయ్యారు. అనంతరం కొద్దికాలానికే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్లలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అసంతృప్తి నెలకొని.. గతేడాదే అవిశ్వాసానికి కలెక్టర్‌కు నోటీసు ఇచ్చారు. కానీ నిబంధనల ప్రకారం నాలుగేండ్లు కాకపోవడంతో అది అమలులోకి రాలేదు. అయితే ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్ స్వప్న మరో బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌తో కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీలో ఎలాగో విభేదాలు ఉన్నందున... గతంలో వైస్‌చైర్మన్ పదవిఆశించి, భంగపడిన మురళీధర్‌రెడ్డి మరోసారి పావులు కదపడం మొదలుపెట్టా రు. చైర్‌పర్సన్ పదవిని తనకు అనుకూలంగా ఉన్న పండుగ ల జయశ్రీకి ఇచ్చి, తాను వైస్ చైర్మన్ కావాలని ఆశిస్తున్నారు. దీంతో ఈ నెల 25తో నాలుగేండ్లు పూర్తి కాగానే అవిశ్వాసానికి రంగం సిద్ధం చేశారు. అయితే దీనిని అడ్డుకునేందుకు విజయశేఖర్‌రెడ్డి వర్గం కూడా సిద్ధమైంది. దీంతో రాజకీయం రసవత్తరంగా మారింది.



కప్పరి స్రవంతి

## ఇబ్రహీంపట్నంలోనూ రంగం సిద్ధం..

ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపైనా అవిశ్వాసానికి రంగం సిద్ధమైనది. గతంలోనే కలెక్టర్‌కు నోటీ సు ఇచ్చినప్పటికీ నిబంధనల ప్రకారం నాలుగేండ్లు పూర్తి కా నందున అవిశ్వాసానికి అవకాశం లేకుండా పోయింది. దీం తో నాలుగేండ్లు పూర్తైన వెంటనే అవిశ్వాస మేఘాలు కమ్ముకోనున్నాయి. ఇక్కడ మొత్తం 24 వార్డులుండగా... బీఆర్‌ఎస్ 16 స్థానాల్లో విజయబావుటా ఎగురవేసింది. రెండు స్థానాలను బీజేపీ దక్కించుకోగా... ఆరు స్థానాల్లో కాంగ్రెస్ గెలిచిం ది. సంపూర్ణ బలం ఉండటంతో బీఆర్‌ఎస్‌కు చెందిన కప్పరి స్రవంతిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. అయితే ఇటీవల ఆమె కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. దీంతో పూర్తిస్థాయి బలము న్న బీఆర్‌ఎస్ అవిశ్వాసానికి రంగం సిద్ధం చేసింది. ఈ విష యం ముందుగా తెలియడంతోనే ఆమె ఇటీవల ఇబ్రహీం పట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా పెట్టారు. ఈ నేపథ్యంలో స్రవంతి పార్టీ మారడం, గతంలోనే ఆమెపై కౌన్సిలర్లలో పెద్ద ఎత్తున అసంతృప్తి ఉండటం, తాజా కేసు నేపథ్యంలో ఆమె చైర్‌పర్సన్ పద వి పోవడం వందశాతం ఖాయమైందని బీఆర్‌ఎస్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.